

ప్రజలను చైతన్య పర్చేందుకే సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ప్రజలను చైతన్య పరిచేందుకే సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వెన్నెల అన్నారు. మంగళవారం మండలంలో ఆమె సైకిల్ యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతపై చైతన్యం, శిరస్త్రాణం, సీటు బెల్టు వినియోగించేలా అవగాహన కల్పించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలం నుంచి కోనపాపేట, అన్నవరం, పాడేరు, శ్రీకాకుళం చేరుకొని అనంతరం తెలంగాణ రాష్ట్రానికి వెళతానని అన్నారు.



మండలానికి చేరుకున్న వెన్నెల

డిగ్రీ అడ్మిషన్ల కోసం ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని, డిగ్రీ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. మంగళవారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ సాధారణ డిగ్రీ విద్యలో ఉన్నత విద్యామండలి తీసుకొస్తున్న మార్పులు విద్యార్థులను గందరగోళం లోకి నెట్టి వేస్తున్నాయన్నారు. డబుల్ మేజర్ విధానం ను ప్రకటించి, ఆచరణలో దాని లాభనష్టాలను చూడకుండా దానే రివ్యూ నిర్వహించి సింగిల్ మేజర్ విధానంను కొనసాగించాలని నిర్ణయించారన్నారు. సింగిల్ మేజర్ విధానం ఇప్పటికే ఆచరణలో విఫలమైందన్నారు. ఫెయిల్ అయిన విధానాన్ని తిరిగి కొనసాగించడం భావ్యం కాదన్నారు. ఇది విద్యార్థులు భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. డిగ్రీ విద్యలో డబల్ మేజర్ విధానం ను అమలు పరచాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాలల మొదటి సంవ త్సరం ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదన్నారు. దీని వలన ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఇంటర్మీడి యట్ పూర్తి అయినా డిగ్రీలో చేరేందుకు ఆలస్యం కావడం వలన కొంతమంది విద్యార్థులు ఇతర కోర్సులకు లేదా డ్రాప్ ఔట్స్ మిగిలిపోతున్నారన్నారు. వెంటనే డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. డిగ్రీ ప్రవేశాలు ఆన్లైన్లో ఉండటం వలన ఎక్కువ శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయన్నారు. ఏ కళాశాలలో చేరా లనుకుంటే అక్కడ జాయిన్ అయ్యే అవకాశం ఉండటం లేదన్నారు. కాలేజ్లో చేరిన తర్వాత రోజువారి కాలేజీకి వెళ్లడానికి బస్సు అనువుగా లేకపోవడంతో సుదూర ప్రాంతాలు ప్రయాణం చేయాల్సి వస్తుందన్నారు. విద్యార్థి ఎంపిక కున్న కోర్సుల్లో జాయిన్ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటున్నాయన్నారు. కనుక డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు ఆన్లైన్ కాకుండా ఆఫ్లైన్లో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వాసుదేవ్, సిహెచ్.సాహిత్, జిల్లా, నగర, కళాశాల నాయకులు కరుణ్, సత్య, తేజ, మహాలక్ష్మి, దిప్తి, అను తదితరులు పాల్గొన్నారు.



ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆధునిక పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్మోహన్ సగిలి

ఆధునికీకరణ చేసిన పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వివిధ కంపెనీలకు చెందిన సిఎస్ఆర్ నిధులు రూ.78.77 లక్షలతో ఆధునికీకరణ చేసిన పనులను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ప్రారంభించారు. తొలుత జిజిహెచ్ ట్రామాకేర్ బ్లాక్లో న్యూరాలజీ, పలమనాలజీ, అనస్తీస్య, కార్డియాక్ విభాగాలకు సంబంధించిన యంత్ర పరికరాలను, న్యూరో ఒపి షెడ్ను ప్రారంభించారు. అలాగే ఆర్థోపెడిక్ ఒపి బ్లాక్ వద్ద ప్రివెంటివ్ ఆంకాలజీ షెడ్ను, ఆధునికీకరించిన బ్లడ్ శాంపిల్ కలెక్షన్ ఒపి షెడ్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి కె.పద్మశ్రీ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్ఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, డాక్టర్ శ్రీనివాసన్, ఒఎన్జిసి జిఎం హెచ్ఆర్కె.సునీల్కుమార్, సిపిఒ పి.త్రినాథ్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్.రత్నరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మానవ అక్రమ రవాణా నివారణ, మహిళా భద్రతపై మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం జరిగింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు, న్యాయవాది జంగం సంతోషాకుమారి మహిళా ప్రయాణికులకు వారి ప్రయాణంలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో సంప్రదించవలసిన హెల్ప్లైన్ నంబర్లు 139 (రైల్వే హెల్ప్లైన్), 1098 (చైల్డ్లైన్), మరియు 100 (పోలీస్) ఉపయోగం, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జికెఎస్ శ్రీదేవి, ఆర్పిఎఫ్ ఎస్ఐ వి.వరప్రసాద్, సిఆర్ఎఫ్కాకినాడ కోఆర్డినేటర్ సి.కుమారి, బి.లక్ష్మి, మూర్తి, చంద్రిక, చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంతోషాకుమారి

ఆర్బి.పట్నం సొసైటీ అధ్యక్షునిగా దొరబాబు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆర్బి.పట్నం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రీ సభ్య కమిటీ ఛైర్మన్గా పెనుమర్తి దొరబాబు, సభ్యులుగా బత్తిరెడ్డి శ్రీను, నల్లల శ్రీనివాసు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.



పెనుమర్తి దొరబాబు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనం నుంచి నువ్వులుగుంటవీధి, పరదేశమ్మ కాలనీ, చిన గాంధీ బొమ్మ సెంటర్, భగత్ సింగ్ సెంటర్ ల మీదుగా ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు రంగాన్ని ఆదానికి కట్టబెట్టే కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. విద్యుత్తు శాఖకు సంబంధం లేకుండా స్మార్ట్ మీటర్లు ప్రయివేటు సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు విద్యుత్తు వినియోగించిన తర్వాత బిల్లు కట్టే వారమని, ఇకపై డబ్బు కట్టిన తర్వాత మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. దీనిని గమనించి ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, నాయకులు దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, గరగపాటి పెంటయ్య, కూనిరెడ్డి అప్పన్న, డి.సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, చల్లా విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



మీడియాతో మాట్లాడుతున్న పురపాలక శాఖామంత్రి నారాయణ

రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచడమే కూటమి ధ్యేయం

ప్రజాశక్తి - జగ్గంపేట

రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారా బయణ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యా లయంలో ఆయన మీడిబ యాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిందని, ఐనా సిఎం చంద్రబాబు వాటిని అధిగ మిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తు న్నారన్నారు. తల్లికి వందనం 67 లక్షల మంది పిల్లలకు రూ.10 వేల కోట్లను బ్యాంకులో జమ చేయడం జరిగింద న్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు అమలు చేయడం జరుగు తుందన్నారు. సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో తిరుగుతున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, టిడిపి నాయకులు ఎస్వివిఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప, పెద్దాపురం

కరప మండలం అరట్లకట్ట గ్రామంలో ఉన్న వెంకటేశ్వర ఏజెన్సీస్ ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఇంటర్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎరువులు ఇన్వాయిసిస్, ఫారం ఒ, ఇ పోస్ రిపోర్ట్తో గ్రౌండ్ బ్యాలెన్స్ ట్రాలీ అయినది లేనిది తనిఖీ చేశారు. బిల్ బుక్స్, స్టాక్ రికార్డ్స్ను పరిశీలించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని షాపు యజ మానిని స్క్వాడ్ అధికారులు ఆదేశించినట్లు మం డల వ్యవసాయ అధికారిని ఐ.సత్య తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పి.శివరామకృష్ణ, ముమ్మిడివరం ఎడిఎ ఎంఎ. షంషీ పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం పట్టణ పరిధిలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల షాపుల్లో మంగళవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాణ్యతాపరమైన అంశాలు, స్టాక్ వివరాల లభ్యత, స్టాకు రిజిస్టర్లు ఫారం-ఎం, లైసెన్స్ కాపీలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు పి.శివరామకృష్ణ, ముమ్మిడివరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఎ.సంషీ, పెద్దాపురం మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్కుమార్ పాల్గొన్నారు.



కరపలో తనిఖీలు చేస్తున్న అధికారులు

తొలి అడుగులో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి - జగ్గంపేట, తాళ్లరేవు

జగ్గంపేటలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలు సమస్యలను ఏకరవు పెట్టారు. ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పొంగులేటి నారాయణ, ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని సమస్యలను తెలుసుకుంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి లక్షలు ఖర్చు అయ్యాయని, సిఎంఆర్ఎఫ్ ఇప్పించాలని ఒక వృద్ధురాలు కోరారు. తమ పిల్లలకు తల్లికి వందనం రాలేదనే ఒక తల్లి వారి దృష్టికి తెచ్చారు. అలాగే డ్రెయినేజీ సదుపాయం లేక మురుగునీరు పారడం లేదని పలువురు మహిళలు ఏకరవు పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నాయకులు ఎస్వివిఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్రావు, తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కలుషితమైన నీరు వస్తుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, కట్టా త్రిమూర్తులు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి సత్యనారాయణ, కొప్పిశెట్టి బాబి, వెంటపల్లి ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ఎంఎల్ఎకు సమస్యను వివరిస్తున్న మహిళలు

పోలవరం కాలువ పనుల్లో ప్రమాదం

-ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తుని

తుని సమీపంలో కొట్రాళ్ల కొండ వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో మంగళవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొట్రాళ్ల కొండ వద్ద పోలవరం ఎడమ కాలువ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న వంతెన పనులను కార్మికులు చేస్తున్నారు. వంతెనపైకి ఇనుప చువ్వలను అందించే క్రమంలో పై నుంచి ఆ చువ్వలు కిందకు పడ్డాయి. ఈ ప్రమాదంలో వెస్ట్ బెంగాల్కు చెందిన శ్రీవాస్, రెహమాన్ అనే ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పోలవరం నిర్మాణ కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కార్మికులకు హెల్మెట్, డాంగ్రీలు, గ్లౌజ్లు ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు సేఫ్టీ సిబ్బంది లేకపోవడం వల్ల కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బాస్కెట్బాల్ పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 13న రాజమహేంద్రవరంలో జరిగిన అండర్ 18 బాలుర విభాగంలో జరిగిన బాస్కెట్బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టులో ఆదిత్య డిగ్రీ విద్యార్థులు బి.క్రాంతికిరణ్, కె.రాజేష్ ఉత్తమంగా రాణించారు. ఈ సందర్భం గా విజేతలను ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలలో చదువుతోపాటు క్రీడలను ప్రోత్సహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దిన్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నాయుడు

రైతుల పురోభివృద్ధి కోసం కృషి

ప్రజాశక్తి - కాజులూరు

రైతుల పురోభివద్దే లక్ష్యంగా పని చేస్తానని సహకార సంఘ అధ్యక్షులు కోట తాతబ్బాయి అన్నారు. మంగళవారం ఆర్యవటం సహకార సంఘ భవనంలో త్రీసభ్య కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. అధ్యక్షులుగా కోట తాతబ్బాయి, సభ్యులుగా తలాటం సత్తిరాజు, శాఖ పట్టాభిరామయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తాతబ్బాయి మాట్లాడుతూ రైతులకు ఉపయోగకరమైన విధానాలను సంఘంలో అమలు చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో రైతులకు చేరేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, రుణాలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డేగల వెంకట సతీష్, సిరిపురం డిసి పేపకాయల నారాయణరావు, వనం వీరబ్రహ్మం, రామారెడ్డి, సనపల ధనరాజు, రెడ్డి శేషారావు, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న త్రీ సభ్య కమిటీ సభ్యులు

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి విద్యార్థి తల్లి పేరుతో ఒక మొక్కను నాటి దానిని సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మినిస్టరీ ఆఫ్ యూత్ అఫ్ఫైర్స్ స్పోర్ట్స్ అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మణికర్ణిక యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి మోడీ ప్రతి తల్లిపేరుతో ఒక మొక్కను నాటించి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారని తెలిపారు. తల్లి పేరుతో మొక్కను నాటితే తల్లిలా చూసుకుంటారనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు అవసరమైన ఆక్సిజన్ను అందించే మొక్కలను నాటాలని సూచించారని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి ఆ మొక్కకు ప్రతి రోజు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన వారికి కేంద్ర ప్రభుత్వం అందించిన సర్టిఫికెట్స్ను ఎంఎల్ఎ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు, టిడిపి నాయకులు ఎస్వివిఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, మణికర్ణిక యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు అనూష, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు మణికంఠ, పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవితా కేంద్రంలో ప్రతి వారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని వికలాంగ బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ చౌదరి సూచించారు. మంగళవారం స్థానిక మహాత్మా గాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ వల్ల వికలాంగ బాలలకు సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్ఛార్జ్ ఎ.రవళి, భవిత సిబ్బంది బి.దుర్గాప్రసాద్రెడ్డి, బి.ఆనంద్రావు, ఫిజియో థెరపిస్టు డాక్టర్ అపర్ణ, బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన లేకుండా స్పందించొద్దు

ప్రజాశక్తి - కరప

పూర్తి అవగాహన లేకుండా ఎటువంటి మెసెజ్లపై స్పందించవద్దని ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో కరప గ్రామానికి చెందిన దెయ్యాల గీతాప్రకాష్ కుటుంబ సభ్యులకు సిఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.90 వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే ప్రచారంపై పూర్తి అవగాహన లేకుండా ఫార్వర్డ్ చేయవద్దని, పార్టీ లైన్ దాట వద్దని జనసేన కార్యకర్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో కరప నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల గంగసత్యనారాయణ, ముద్రగడ రమేష్, పేకేటి దుర్గాప్రసాద్, వాసంశెట్టి మహేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం పిఎసిఎస్ అధ్యక్షునిగా బూరయ్య

ఏలేశ్వరం : ఏలేశ్వరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా టిడిపి మండల అధ్యక్షుడు సూతి బూరయ్య, సభ్యులుగా వైభోగుల సుబ్బారావు, కొప్పిశెట్టి సత్తిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బూరయ్య మాట్లాడుతూ రైతుల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పిఎసిఎస్ త్రీసభ్య కమిటీని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, టిడిపి నాయకులు జ్యోతుల పెదబాబు, ఎస్జివి.సుబ్బరాజు, చందువోలు రాజా, బస ప్రసాద్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, చిక్కాల లక్ష్మణరావు, సిఇఒ జ్యోతుల నాగసత్యశ్రీనివాస్ అభినందించారు.



కార్టూ'నిజం'



పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - కోటనందూరు, కాజులూరు

కోటనందూరు మండలంలోని బిల్లనందూరు, కోటనందూరు, సురపురాజుపేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరి గింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కెజె.చంద్రశేఖర్ పాల్గొని మాట్లా డారు. వరి నారుమడి విత్తన శుద్ధి, సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. వరి విత్తనాలకు సుడోమోనాస్ పౌడర్తో విత్తనశుద్ధి చేయడం ద్వారా వరిలో వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బయలుపూడి శ్రీరాంమూర్తి, ఎఇఒ పి.జగ్గఅప్పారావు, సురేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కాజులూరు మండలంలోని కోలంక గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో ఆధునిక, సాంకేతికతను అన్వయిస్తే అధిక లాభాలు సాధించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్స్ ఇస్తున్నారని, వాటిని గ్రామంలో ఉన్న రైతులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ఉన్న కౌలు రైతులు అందరూ పంట సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసవర్మ, రైతులు పాల్గొన్నారు.



కోటనందూరులో మాట్లాడుతున్న ఎఒ చంద్రశేఖర్



రిటైర్డ్ హోంగార్డుకు చెక్కును అందిస్తున్న ఎస్2పి బిందుమాదవ్

రిటైర్డ్ హోం గార్డులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాకినాడ

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి, పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు ఎస్పి జి.బిందుమాధవ్ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఇటీవల పదవీ విరమణ పొందిన మహిళా హోంగార్డ్ సిహెచ్.భవానీకి జనరల్ హోంగార్డ్స్ 626 మంది ఒక రోజు జీతం కంట్రిబ్యూషన్గా ఇచ్చిన రూ.4,44,460 చెక్ను ఎస్పి చేతుల మీదుగా మంగళవారం ఎస్పి కార్యాలయంలో అందజేశారు. అలాగే పదవీవిరమణ పొందిన మరొక హోంగార్డ్ పి.రామకృష్ణారావుకు డిప్యూటేషన్పై పని చేస్తున్న 278 మంది హోంగార్డ్స్ ఒకరోజు జీతం కాంట్రిబ్యూషన్ మొత్తం రూ.1,97,380 చెక్ను ఎస్పి అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డు విభాగాన్ని ఎస్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎం.నరసింహమూర్తి పాల్గొన్నారు.



నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రయివేటు బస్సు ఢీకొని మంగళవారం వ్యక్తి మృతి చెందగా మరొకనికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ కెవి.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండల పరిధి గోపాలపురం అగ్రికల్చర్ చెక్ పోస్ట్ వద్దఅదే గ్రామానికి చెందిన అవిడి సత్తిపండు(51) అతని స్నేహితుడు అత్తిలి యేసుబాబు పని ముగించుకుని మోటార్‌సైకిల్ ఇంటికి వస్తున్నారు. వెనుక వస్తున్న ప్రయివేటు టూరిస్ట్ బస్సు ఢీ కొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిగా అప్పటికే సత్తిపండు చనిపోయినట్లు తెలిపారు. మరొక వ్యక్తి యేసు బాబుకు గాయాలయ్యాయి. ఇతనిని రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. దీనిపై సత్తిపండు కుమారుడు ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టిని తరలిస్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం నారా లంక గ్రామంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం నారాయణలంకలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న లారీని కేదాలంక, కపిలేశ్వరపురం, గ్రామ రెవెన్యూ అధికారులు టి వెంకటేశ్వరరావు, ఎస్ సత్యనారాయణ, అంగర ఏ ఐ ఎస్ ఆర్ సత్య నారాయణ పట్టుకుని సీజ్ చేసి అంగర పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

అంతరాష్ట్ర స్థాయిలో ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ ఎ.కృష్ణభగవాన్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. సామర్లకోట కొత్త వంతెన వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతను కంచర్ల మోహన్‌రావు అలియాస్ మోహన్ అనే అంతర్ జిల్లాల దొంగగా గుర్తించామని తెలిపారు. అతని వద్ద నుంచి ఇప్పటికే జరిగిన నాలుగు దొంగతనాలకు సంబంధించిన సుమారు 50 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండిని రికవరీ చేశామన్నారు. అనంతరం మోహన్‌ను కాకినాడ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించేందుకు ప్రజలు ఇంటి నుంచి బయలుదేరే ముందు సమీప పోలీస్‌స్టేషన్‌కి గాని, పొరుగువారికి గాని సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటిని సురక్షితంగా లాక్ చేయాలని సూచించారు. పోలీసు శాఖ అందజేస్తున్న లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను వినియోగించుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు వెంటనే పోలీస్ కంట్రోల్ రూం లేదా సమీప స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నిందుతుడిని అరెస్టు చేయడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్‌బాబు, ఇతర సిబ్బందిని అభినందించారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, సేవిస్తున్న ఐదుగురుని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ జి.శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి గొల్లప్రోలు శివారు నల్లం వారి లేఔట్‌లో దాడి చేయగా 4 కేజీల గంజాయిని, నలుగురు వ్యక్తులతోపాటు, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తమ విచారణలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన మడ్డు లోకేష్ నల్లం వారి లేఅవుట్ వద్దకు గంజాయిని తెచ్చాడు. ఆ ప్రదేశంలో కాకినాడ రేచర్ల పేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్, పిఠాపురం మంగమ్మరావు పేటకు చెందిన దానాల మనోహర్, యు.కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన రామిశెట్టి దుర్గాప్రసాద్‌లతోపాటు, ఒక మైనర్ కలిసి కొంత గంజాయిని వారు వాడుకోవడానికి తీసుకుని, మిగిలిన గంజాయిని విక్రయించేందుకు సమానంగా పంచుకుంటుండగా వీరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక తూరంగి మహాలక్ష్మినగర్ పగడాలపేట ప్రాంతాల్లో క్రైస్తవులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రెసిడెంట్ పాస్టర్ మోసా అబ్రహం కోరారు. మంగళవారం ఎంఎల్ఎ పంతం నానాజీని కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 130 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలనలో క్రైస్తవులకు కేటాయించిన స్మశానవాటిక మాత్రమే ఉందని అన్నారు. గత 15 సంవత్సరాలుగా పాత సమాధులలో ఎముకులను బయటికి తీసి కొత్త సమాధులను చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నానాజీ స్పందించి తూరంగి పంచాయతీ అధికారులకు ఫోన్ చేసి స్థలం విషయంలో వివరాలు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎస్.ప్రభాకర్, కె.మోజెస్, జాన్‌ప్రసాద్, సలగల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉండూరు పాఠశాలను పరిశీలించిన సిఎంఒ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని ఉండూరు ప్రకాశరావుపేటలో ఉన్న ఎంపిపి పాఠశాలను విద్యా శాఖ సిఎంఒ చామంతి నాగేశ్వరరావు మంగళవారం తనిఖీ చేశారు. తొలుత పాఠశాలలో విద్యాప్రమాణాలను పరిశీలించారు. పాఠశాలను కార్పొరేట్ పాఠశాల తరహాలో అభివృద్ధి చేయడం అభినందనీయమని, కంప్యూటర్ విద్యను అందించటం శుభపరిణామం అని అన్నారు. పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టును ఏర్పాటు చేసినందుకు హెచ్ఎం కెవిఎంఆర్.ప్రసాద్, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా బాస్కెట్ బాల్ ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

యానాం వార్తలు



ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు, దళితులు

దళిత సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా పుదుచ్చేరి గెజిట్ ద్వారా జిఒ నెంబర్ 5కు వ్యతిరేకంగా దళిత సంఘాలు ఆందోళన నిర్వహించాయి. మంగళవారం ఎస్‌సి, ఎస్‌టి యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక జెండా స్తంభం వద్ద దళితులు ఆందోళన చేపట్టారు. ముందుగా పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం వందల మంది ప్లకార్డులు చేతబట్టి ఆర్ఎఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ఎఒ మునిస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరాం, తిరికోటి నాగేశ్వరరావు, న్యాయవాది కమిడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను జిఒ నెంబర్ 5 ద్వారా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. తక్షణమే ఈ జిఒలో అంశాలను తొలగించి యథావిధిగా దళితులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగు బలరాం, పువ్వల వెంకటరావు, యాళ్ళ వెంకట్‌కుమార్, సబ్బతి శ్రీనివాస్, లోకేశ్వరావు, సిద్ధార్థ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కామరాజ్ నాడర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

మహానేత పెరుగుంతలైవార్ కామరాజ్ నాడర్ జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, కొల్లు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్ డే

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డ్రోన్ టెక్నాలజీ ఎక్స్పర్ట్ వై.శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గడియార స్తంభం ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

స్థానిక రైల్వేస్టేషన్ రింగ్ సెంటర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అధునాతనంగా నిర్మించిన గడియార స్తంభంను మంగళవారం రాత్రి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. గడియార స్తంభం వద్ద ఏర్పాటు చేసిన 'ఐ లవ్ సామర్లకోట" పేరుతో ఉన్న సెల్ఫీ పాయింట్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పతో కలసి మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీ యంగా రాణిస్తున్న స్విమ్మర్ గోలి శ్యామలను మంత్రి నారాయణ శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే పెద్దాపురంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు స్వగృహంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మంత్రి నారాయణ పాల్గొని మాట్లాడారు. అనంతరం 4, 5 వార్డుల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, తదిరులు పాల్గొన్నారు.




సామర్లకోటలో గడియార స్తంభంను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిఆర్‌డిఎ పీడీ జి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని చేబ్రోలు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో రుణ మేళ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులను వ్యాపారవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో డ్వాక్రా మహిళలకు వ్యక్తిగత రుణాలను అందించడం జరుగుతుందన్నారు. లక్ పతి దిది పథకంలో బ్యాంకుల నుంచి ప్రతి మహిళకు లక్ష రూపాయల నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందిస్తున్నట్లు తెలిపారు. రుణాలను సక్రమంగా ఉపయోగించుకుని లక్షాధికారులు కావాలని అన్నారు. చైతన్య గోదావరి ఆర్ఎం గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్లో చైతన్య గోదావరి బ్యాంక్ ద్వారా ఎక్కువ రుణాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించినట్లయితే మిగతా వారికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. గొల్లప్రోలు, చేబ్రోలు చైతన్య గోదావరి బ్యాంకుల నుంచి 100 మంది మహిళా సంఘ సభ్యులకు రుణ మేళ ద్వారా రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎ ఆర్.సన్యాసిరావు, గొల్లప్రోలు, చేబ్రోలు చైతన్య గోదావరి మేనేజర్లు లక్ష్మీకాంత్, కె.సుధీర్, స్టాఫ్ మేనేజర్ ఎన్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్‌ను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

మధ్యవర్తిత్వంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - పిఠాపురం

కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు ఇరుపక్షాల వారి కక్షిదారులకు మధ్యవర్తిత్వం ఎంతో మేలని తద్వారా కేసులు పరిష్కారం అవుతాయని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి అన్నారు. మంగళవారం కోర్టు భవనం నుంచి స్థానిక చర్చి సెంటర్ వరకు మధ్యవర్తితంపై కరపత్రాలు పంచుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఇరు పార్టీలు మధ్యవర్తిత్వం రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవడంతో ఇరు వర్గాలకు మేలు జరగడంతో పాటు, సమయం, ఖర్చు ఆదావుతుందన్నారు. ఇరుపార్టీల యొక్క పరస్పర సహకారంతో మధ్యవర్తిత్వం చేసే అధికారి ద్వార తక్కువ సమయంలో కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఖర్చు తక్కువ, సమయం ఆదా, సామరస్య పరిష్కారం, గోప్యతతో కూడిన అనుకూలమైన మధ్యవర్తిత్త ప్రక్రియ ద్వారా దశాబ్ద కాలాలనాటి పెండింగ్ కేసులు పరిష్కరించుకునేందుకు ఇదో చక్కటి మార్గమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కోర్టులో ఉన్న పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు మధ్యవర్తితత్వం ఇరు పార్టీలకు ఎంతో మేలు చేకూరుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగ రాజారావు, జిల్లా కోర్టు ఎపిపి బత్తిన లక్ష్మణదొర, మాజీ ఎపిపి ఎకెవై.రెడ్డి, ఎస్ఎం.అలీ, కె.భాస్కర్, ముమ్మిడి శ్రీను, కొంజర్ల అప్పారావు, ఎం సత్యవేణి, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

సురేష్‌కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం వద్ద గల ఆదిత్య యూనివర్సిటీ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సురేష్ పర్ల ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి నేతృత్వంలో సురేష్ సమర్పించిన థీసిస్ శీర్షిక 'ఏ స్టడీ ఆన్ ఫైనాన్సింగ్ ఛాలెంజెస్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్-విత్ రిఫరెన్స్ టు సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు.



డాక్టర్ సురేష్ పర్ల

వేస్టేజ్ నిర్వహణపై జడ్‌పి సిఇఒ తనిఖీ

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్ట గ్రామంలో వేస్టేజ్ నిర్వహణపై మంగళవారం జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించడంపై లక్ష్మణరావు ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారులను అభినందించారు. ఐవిఆర్ఎస్ కాల్స్ వచ్చిన ఇండ్లకు వెళ్లి నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో యువ నైపుణ్య దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, కృత్రిమ మేధ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ తృతీయ సంవత్సర విద్యార్థులు జి.ప్రవీణ్, శామ్యూల్‌రాజు, డిడి.నవదీప్, పవన్‌రాకేష్ రోబో హ్యాండ్, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎం.స్ఫూర్తి, యు.సాయిశ్రావణి స్పార్కీబాట్ తయారు చేసి వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ కృత్రిమ మేధా, డేటా సైన్స్ విభాగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, నైపుణ్యవంతులేని యువతను తయారు చేసే బాధ్యత అధ్యాపకులు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విభాగాలను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నలమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ టి.తేజేశ్వరరావు, ఎఐ డీన్ సిద్ధార్థరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అకడమిక్ డైరెక్టర్ నాయుడు

మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గండేపల్లి

మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపిపి చల్లగళ్ల పద్మనాభుడు అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎంపిడిఒ కె. చంద్రరావు పి.4 పథకంలో బంగారు కుటుంబాల దత్తత గురించి వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

బిఎల్ఒలకు శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఓటర్ జాబితా సంస్కరణలపై బిఎల్ఒలకు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీరమణి పర్యవేక్షణలో డిప్యూటీ తహశీల్దార్ శిక్షణ ఇచ్చారు. బిఎల్ఒల బాధ్యతలు, ఓటర్ నమోదు, తొలగింపు, సవరణ, వలస ఓటర్ల సమాచారం అప్‌డేట్, ఇఆర్ఒ నెట్, గరుడా యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీరమణి మాట్లాడుతూ బిఎల్ఒలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన 3వ విడత బిఎల్ఒలకు శిక్షణ ఇస్తారన్నారు.

విద్యతోపాటు, నైపుణ్యత అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రస్తుత ఆధునిక సమాజంలో పాఠశాల విద్యతో పాటు ప్రయోగాత్మక నైపుణ్యత అవరమని జిల్లా వృత్తి విద్యా కోఆర్డినేటర్ సయ్యద్ అహ్మద్ కరీం అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో వొకేషనల్ విద్య విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్య భారత్ ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాన్ని చేరాలంటే పాఠశాల స్థాయి నుంచి వృత్తి విద్యా కోర్సులపై అవగాహన అవసరమనిఅన్నారు. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, రోల్ ప్లే వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ హెచ్ఎం కె.గంగాభవాని, వొకేషనల్ ఫ్యాకల్టీలు యాదిద్య, జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయు సెట్ ర్యాంకర్‌కు ప్రోత్సాహం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎయు సెట్‌లో స్టేట్ 11ర్యాంకు సాధించిన కణితి సోమశేఖర్‌కు కరుటూరి చారిటబుల్ ట్రస్ట్ రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ తోట నరసింహం, పార్టీ జిల్లా బూత్ కమిటీల కన్వీనర్ ఒమ్మి రఘురామ్, యువ నాయకులు తోట శ్రీరాంజీ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ కరుటూరి శ్రీనివాస్, కరుటూరి రాజు పాల్గొన్నారు.

కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - కాజులూరు, తాళ్లరేవు

తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ బొడ్డువాని లంక గ్రామానికి చెందిన నరాల నాగరాజు (36) కౌలు రైతు పంట కాలవలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజులూరు మండలం శీలలంకలో మూడు ఎకరాల కౌలు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం చేనుకు నీరు పెట్టడానికి పంట కాలవలో దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. సాటి రైతులు వ్యవసాయ కూలీలు గుర్తించేసరికి అతను ప్రాణాలు విడిచినట్లు స్థానికులు తెలిపారు. కౌలు రైతుకు భార్య వరలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోరంగి త్రీ మెన్ కమిటీకి అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి త్రీమెన్ కమిటిని ప్రభుత్వం ప్రకటించింది. కోరంగికి చెందిన కొప్పిశెట్టి శ్రీనాగ వీరభద్ర ఈశ్వరరావు, పటవల పంచాయతీ శాంతమూలకు చెందిన వాసంశెట్టి గోవిందు, జి. వేమవరం పంచాయతీ రాయమెరకకు చెందిన యేచూరి సత్తిరాంబాబు ఈ కమిటిలో ఉన్నారు. కమిటి సభ్యులను ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు మంగళవారం అభినందించారు.